సాక్షి రంగారెడ్డి

శనివారం । 29 । జూలై । 2023



జప్తునకు రంగం సిద్ధం

పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొంది వాయిదాలు చెల్లించని బకాయిదారుల ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం చేస్తున్నారు. 8లో▸



ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి సూచించారు. 8లో▸



జేఏసీ మాజీ చైర్మన్ మృతి

తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు, ఉమ్మడి జిల్లా జేఏసీ మాజీ చైర్మన్ వెదిరె చెల్మారెడ్డి అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 8లో▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల (మహేశ్వరం గేటు) బీబీఏ కోర్స్ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విరూపాక్షప్ప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంబీఏలో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 31వ తేదీ వరకు తుక్కుగూడలోని ఎంజేపీ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94900 52739, 95028 42484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

మొయినాబాద్: డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) ఆధ్వర్యంలో ఈ నెల 30న (ఆదివారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఈఈటీ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని చైతన్య కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. మహీంద్రా ఫైనాన్స్, టాటా డ్రైవ్‌లులు ఇంటర్నేషనల్ షాపింగ్‌మాల్, మెడ్‌ప్లస్, ఢిల్లీవేర్, అపోలో ఫార్మసీ, కార్సోన్ బీపీఓ, మైమోనీకర్మ వంటి 20కి పైగా ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో మహిళలకు మగ్గం వర్క్స్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో ఈ నెల 31 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి చదివిన మహిళలు ఈ నెల 31లోగా చిలుకూరులోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారానికి ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఇస్తామని చెప్పారు. వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాగ్రత్తలు తీసుకోండి.. పంటలను కాపాడుకోండి

జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి



మామిడిపల్లిలో రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి

నందిగామ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో మండల వ్యవసాయాధికారి గోపాల్‌తో కలిసి శుక్రవారం ఆమె పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల రైతులు పంటలను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తికి రసం పీల్చే పురుగుల బెడద ఉంటుందని, వాటి నివారణకు డయాఫిన్‌ట్యూరాన్‌తో పాటు అసిట మప్రిడ్3.9 డబ్ల్యూపీ 20 లీటర్ల నీటికి 25 గ్రాములు వేసి పంటలపై పిచికారీ చేయాలన్నారు. వరి నారు మళ్ల దశలో ఉన్నాయని, వరి నారు వేసే ముందు నారు కొనలు తెంచి వేయాలని, అనంతరం నాటాలని వివరించారు. పంటలను సందర్శించిన వారిలో ఏఈఓ రవి ఉన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

మహేశ్వరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఆగస్టు 1 నుంచి స్పాట్‌అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఖాళీల వివరాలను కళాశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించామన్నారు. ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్స్‌తో హాజరు కావాలన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు అదేరోజు రూ.6,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న చందనవెల్లి పెద్ద చెరువు అలుగు

అలుగుల చందనం

వరుసగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు షాబాద్ మండల పరిధిలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం నుంచి షాబాద్ పహిల్వాన్ చెరువు, చందనవెల్లి పెద్ద చెరువు అలుగులు దుంకుతున్నాయి. మండల పరిధిలోని మాచన్‌పల్లి, తాళ్లపల్లి చెరువులు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. బొబ్బిలిగామ, చర్లగూడ, మీరాపూర్, ఏట్ల ఎర్రవల్లి, రేగడిదోస్వాద వాగులు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాలకు నాగర్‌గూడ, తాళ్లపల్లి, ఏట్ల ఎర్రవల్లి, బొబ్బిలిగామ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోవైపు వర్షాలకు వరి, కంది, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – షాబాద్

వ్యాధుల 'ముసురు'

ఏకధాటి వానలతో వీధులన్నీ చిత్తడి

- సమ్మెలో పారిశుద్ధ్య కార్మికులు
- కాలనీల్లో ఏరులై పారుతున్న మురుగు
- కంపు కొడుతున్న కాలనీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యనిపుణులు



మంచాల: లోయపల్లి చౌరస్తాలో పేరుకుపోయిన చెత్త

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకధాటి వర్షాలు.. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె.. వీధుల్లో పేరుకుపోయిన చెత్త.. ఇంటి ముందు ప్రవహిస్తున్న మురుగు నీరు.. కలుషిత జలాల సరఫరా వెరసి జనం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కొంత మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే.. మరికొంత మంది సీజనల్ జ్వరాల బారినపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని బస్తీలతో పాటు మారుమూల పల్లెల్లో ఏ ఇంట్లోకి తొంగి చూసినా ఎవరో ఒకరు ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. వీరంతా చికిత్సల కోసం ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి ఒళ్లు, ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు. వర్షాల నేపథ్యంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

దోమల బెడద

జిల్లాలో 558 పంచాయతీలు, 307 అనుబంధగ్రామాలు ఉన్నాయి. వీటిలో సుమారు 3,620 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని.. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని.. రూ.పది లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా వీరంతా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. కార్మికులంతా సమ్మెలో ఉండటానికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు వీధుల్లో చెత్త, చెదారం పేరుకుపోయింది. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మ్యాన్‌హోళ్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇంటి చుట్టూ డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. రోజుల తరబడి ఫాగింగ్ లేకపోవడంతో రాత్రి పూట దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

నీరు, ఆహారం కలుషితం

పస్తుతం చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. అనేక రకాల రసాయనాలు, ఒండ్రు మట్టిని వెంట తీసుకొస్తోంది. జిల్లాలో మెజార్టీ గ్రామాలకు కృష్ణా జలాలు అందిస్తున్నారు. క్లోరినేషన్ లోపానికి తోడు పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులకు ఏర్పడిన లీకేజీలు, వాల్వ్స్ గుంతల్లో మురుగు నీరు చేరి నిల్వ ఉండడంతో నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని వేడి చేసి, చల్లారిన తర్వాత తాగడం ఉత్తమమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, సాయంత్రం వేళ రోడ్డు వెంట దొరికే పానీపూరి తినడం ద్వారా వాంతులు, విరేచనాల బారిన పడే ప్రమాదం ఉందంటున్నారు. సాధ్యమైనంత వరకు బయటి చిరుతిళ్లకు దూరంగా ఉండాలని, ఇంట్లో తాజాగా సిద్ధం చేసిన వేడివేడి ఆహార పదార్థాలు తీసు కోవడంద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చంటున్నారు.

పొంచి ఉన్న డెంగీ ముప్పు

పారిశుద్ధ్య లోపంతో డెంగీ ముప్పు పొంచి ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారులు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం చూపు తోంది. ఇంటి పరిసరాల్లోని ఖాళీ కొబ్బరి బొండాలు, ఇంటిపై ఉన్న పాత డబ్బాలు, టైర్లు, పార్కింగ్ ప్రదేశాల్లోని పూల కుండీల్లో నీరు నిల్వ ఉండి డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు వీటిని తొలగించడం ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవచ్చని, ఇంటిపై ఉన్న నీటి ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

పాము, తేలు కాట్లు

చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుండడంతో రైతులు పంటల సాగులో మునిగి తేలుతున్నారు. అదే సమయంలో పాములు, తేళ్లు బయటికి వస్తుంటాయి. పంట చేల గట్లు, మైదాన ప్రాంతాల్లో ఆహారం కోసం తిరుగుతుంటాయి. రాళ్లు, చెత్త కుప్పల కింద తేళ్లు చేరుతాయి. వీటిని కదిలించే సమయంలో కాటేసే అవకాశం ఉంది. చికిత్సను నిర్లక్ష్యం చేసి, ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. విషపురుగులు కుట్టిన వెంటనే ఆస్పత్రికి చేరుకుని చికిత్స చేయి ంచుకోవాలని, లేదంటే ప్రాణాలకే ప్రమాదమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అభిప్రాయపడుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్.. తుస్

- దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం
- రసీదు ఉంటేనే అవకాశం
- సీజీఎస్ నుంచి హెచ్‌ఎండీఏకు చేరిన డేటా
- ప్లాట్ల యజమానుల ఎదురుచూపులు



సాక్షి, సిటీబ్యూరో: కొర్రెములకు చెందిన ఓ దరఖాస్తుదారు కొద్ది రోజుల క్రితం తన స్థలం రెగ్యులరైజేషన్ కోసం హెచ్‌ఎండీఏ అధికారులను సంప్రదించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో వెలువడిన నోటిఫికేషన్ మేరకు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. అప్పుడు ఫీజు చెల్లించినట్లుగా రసీదు ఉంటే తప్ప తాము ఏమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. మూడేళ్ల క్రితం చెల్లించిన ఫీజు తాలూకు రసీదు అతని వద్ద లేదు. సదరు దరఖాస్తుదారే కాదు. అప్పట్లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది దరఖాస్తుదారుల వద్ద ఇప్పుడు ఎలాంటి రసీదులు లేకుండాపోయాయి. పైగా చాలామంది తమ స్థలాలను ఇతరులకు విక్రయించారు. ఈ పరిస్థితుల్లో రసీదు ఉంటే తప్ప ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన సాధ్యం కాదని హెచ్‌ఎండీఏ అధికారులు చెప్పడం వారి పాలిట అశనిపాతంలా మారింది. కొర్రెంల, నారపల్లి, పోచారం వంటి వాటితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్త నడకన సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల మధ్య సమన్వయం కొరవడడం కూడా ఇందుకు మరో కారణమని సమాచారం.

వేలాది మంది ఎదురుచూపులు..

- ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం నోటిఫికేషన్ వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు మినహాయించి హెచ్‌ఎండీఏ పరిధిలోనూ సుమారు 80 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు అంచనా. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీఎస్) ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. దరఖాస్తుల స్వీకరణను సులభతరం చేసింది. పెద్ద ఎత్తున దరఖాస్తులను స్వీకరించినప్పటికీ కొన్ని వివాదాల కారణంగా అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్ జారీని నిలిపివేశారు.
- తాజాగా ఎల్‌ఆర్‌ఎస్‌ల జారీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. మొదటి దశలో ఎకరానికి పైగా ఉన్న వెంచర్‌లలో మిగిలిపోయిన ప్లాట్‌లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం భూయజమానులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హెచ్‌ఎండీఏ పరిధిలోని మేడ్చల్, ఘట్కేసర్, శంషాబాద్, చేవెళ్ల జోన్‌ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్‌కు అయ్యే ఖర్చులను కూడా చెల్లించి ప్రస్తుతం ప్రొసీడింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఒకవైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే చిన్న ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు కూడా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు అవకాశం లభించింది.
- ఫీజు చెల్లించినట్లుగా చాలా మంది వద్ద రసీదులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇటు హెచ్‌ఎండీఏ నుంచి, అటు మున్సిపాలిటీల నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరు హెచ్‌ఎండీఏ అధికారులను స్వయంగా సంప్రదించేందుకు తరలివస్తున్నారు. ఫీజు చెల్లించినట్లుగా రసీదు ఉంటే తప్ప తామేం చేయలేమంటూ అధికారులు తేల్చి చెప్పడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు.

రసీదు తప్పనిసరి కాదు..

ఈ నేపథ్యంలో.. దరఖాస్తుదారుల నుంచి సేకరించిన వివరాలన్నింటిని హెచ్‌ఎండీఏకు అందజేసినట్లు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల వివరాలు తెలుసుకొనేందుకు ఫీజు చెల్లించినట్లుగా ఎలాంటి రుజువులు అవసరం లేదని, అప్పట్లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి డేటా పూర్తిగా అందుబాటులో ఉందని చెప్పారు. 'రసీదుతో సంబంధం లేకుండా దరఖాస్తుదారుల పూర్తి పేరు, సర్వే నంబర్, ప్లాట్ నంబర్, ఫోన్ నంబర్ ఆధారంగా కూడా వివరాలు తెలుసుకొనే సదుపాయం ఉందని చెప్పారు. హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తుదారులు కోరిన సమాచారం మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు వివిధ జోన్‌లలో పని చేసే ఏపీఓలు, జేపీలు, తదితర ఉద్యోగుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతోనూ దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో 'సీడ్ బాల్స్' పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అమృత విద్యాలయం, ఆయుద్- మాతా అమృతానందమయి మఠం (మామ్) భక్తుల సహకారంతో శుక్రవారం సూరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో లక్షా 15 వేల సీడ్‌బాల్స్ పంపిణీ చేశారు. సీడ్ బాల్స్‌ను సీ 20 ప్రపంచ విత్తన బంతి ప్రచారంలో భాగంగా పర్యావరణ సంరక్షణ కోసం అటవీప్రాంతలో పంపిణీ చేశారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, స్థిరమైన పర్యావరణ హిత పద్ధతుల ప్రోత్సాహం లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమృత విద్యాలయం ప్రిన్సిపాల్ 'స్వామిని సువిద్యామృత ప్రాణ' మాట్లాడుతూ.. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుగ్గా పాల్గొనేందుకు సీడ్‌బాల్ పంపిణీ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందని తెలిపారు. సూరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో సీడ్ బాల్స్ విత్తడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా వాటిని పరిరక్షించడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. మెరుగైన భవిష్యత్తు కోసం స్థిరమైన అభ్యాసాల ప్రాముఖ్యత ప్రస్తుత తరానికి చేరువ చేయాల్సిన అవసరముందన్నారు.

గాడితప్పిన ప్రజారవాణా

- కరోనా లాక్‌డౌన్ తర్వాత పల్లెలకు తగ్గిన ఆర్టీసీ బస్సులు
- ఇదే అదనుగా పెరిగిన ఆటోల సంఖ్య
- ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ప్రయాణికులు
- విద్యార్థులకు తప్పని కాలినడక

కరోనా లాక్‌డౌన్‌కు ముందు మొయినాబాద్ మండలం నక్కలపల్లికి ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్టీసీ బస్సు ఆరు ట్రిప్పులు వచ్చేది. ఎక్కువ శాతం మంది బస్సులోనే రాకపోకలు సాగించేవారు. అప్పట్లో గ్రామంలో ఆరు ఆటోలు ఉండేవి. ఒక్కో ఆటో రోజుకు మూడు ట్రిప్పులు నడిస్తే ఎక్కువ. లాక్‌డౌన్ తర్వాత పరిస్థితి మారిపోయింది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు రెండు ట్రిప్పులు మాత్రమే వస్తోంది. దీంతో ఆటోల సంఖ్య పెరిగి ప్రస్తుతం 14కు చేరింది. ఒక్కో ఆటో రోజుకు 5– 6 ట్రిప్పులు తిరుగుతోంది.

మోత్కుపల్లి కొత్తగా ఏర్పడిన పంచాయతీ. లాక్‌డౌన్‌కు ముందు ఆర్టీసీ బస్సు 6 ట్రిప్పులు వచ్చేది. ప్రస్తుతం ఉదయం 8 గంటలకు ఒక్కసారే వస్తోంది. గతంలో ఆటోలు నడిచేవి కావు. ఇప్పుడు 6 ఆటోలు నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్సు ఒకే ట్రిప్పు రావడంతో ఉదయం బస్సులో స్కూలుకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం నడుచుకుంటూ తిరిగి ఇంటికి వస్తున్నారు.

మొయినాబాద్: హైదరాబాద్ నగరానికి శివారులో ఉన్న మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు గతంలో ఆర్టీసీ బస్సులు నడిచేవి. కరోనా లాక్‌డౌన్ తరువాత పరిస్థితి మారిపోయింది. గ్రామాలకు ఆర్టీసీ సేవలు పూర్తిగా తగ్గిపోయాయి. మండల కేంద్రంతోపాటు చిలుకూరు బాలాజీ దేవాలయానికి మాత్రమే బస్సులు ఎక్కువగా నడుస్తున్నాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు వెళ్లే బస్సులు నడుస్తున్నాయి. మొయినాబాద్, హిమాయత్‌నగర్ గ్రామాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. మిగతా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు బస్సులకోసం ఇబ్బంది పడుతున్నారు.

భారీగా తగ్గిన బస్సులు..

లాక్‌డౌన్ తరువాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు భారీగా తగ్గాయి. బాకారం గ్రామానికి గతంలో రోజుకు 30 ట్రిప్పులు నడవగా ఇప్పుడు నాలుగు ట్రిప్పులే నడుస్తున్నాయి. అమ్డాపూర్ గ్రామానికి 24 ట్రిప్పులు వచ్చేది. ప్రస్తుతం 4 ట్రిప్పులు మాత్రమే వస్తోంది. శ్రీరాంనగర్‌కు 14 ట్రిప్పులకు 3 ట్రిప్పు లు నడుస్తోంది. వెంకటాపూర్‌కు 10 ట్రిప్పు లు బస్సులు వచ్చేవి. ఇప్పుడు రెండు ట్రిప్పులే వస్తున్నాయి. కేతిరెడ్డిపల్లికి గతంలో 10 ట్రిప్పులు రాగా 2 ట్రిప్పులు మాత్రమే వస్తున్నాయి. కనకమామిడికి 10 ట్రిప్పులకు 2, మేడిపల్లికి 8 ట్రిప్పులకు 2, చిన్నమంగళారానికి 14 ట్రిప్పులకు ఇప్పుడు 3 ట్రిప్పులు మాత్రమే నడుస్తున్నాయి. మండలంలోని చాకలిగూడ, సజ్జన్‌పల్లి, అప్పారెడ్డిగూడ, అప్పోజీగూడ, ఎలుకగూడ, కాశీంబౌలి తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

పెరిగిన ఆటోలు

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆటోలు పెరిగాయి. ప్రతి గ్రామానికి ఇప్పుడు నాలుగైదు ఆటోలు నడుస్తున్నాయి. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటో డ్రైవర్లు నలుగురు కూర్చునే ఆటోలో 12–16 మందిని ఎక్కిస్తూ ప్రమాదకర ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రతి రోజు వేల మంది యువకులు, మహిళలు ప్రైవేటు పనులకోసం గచ్చిబౌలి, నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. గ్రామాల నుంచి బస్సులు లేకపోవడంతో సొంత వాహనాలు, ఆటోల్లో హైదరాబాద్-బీజాపూర్ రహదారి వరకు వచ్చి అక్కడి నుంచి బస్సుల్లో వెళ్తున్నారు. చిన్న గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ, ఆటోల్లో వెళ్తున్నారు.



గ్రామాలకు బస్సులు లేక ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులు

ఆటోలే ఆధారం



గతంలో ప్రతి రోజు 6 ట్రిప్పులు ఆర్టీసీ బస్సు వచ్చేది. లాక్‌డౌన్ తరువాత మూడేళ్ల నుంచి రావడంలేదు. ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోల్లోనే వెళ్లాల్సి వస్తోంది. ఆటోలు లేకుంటే నడుచుకుంటూ వెళ్తున్నాం.

– రవి, నక్కలపల్లి, మొయినాబాద్ మండలం

బస్సుల సంఖ్య పెంచాలి



బస్సులు రాక ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడంలేదు. స్థానిక ఎమ్మెల్యేతో చెప్పిస్తే మోత్కుపల్లికి ఒక్కరోజు బస్సు పంపారు. తరువాత రోజు నుంచి రావడంలేదు.

– రత్నం, సర్పంచ్, మోత్కుపల్లి

జేఏసీ మాజీ చైర్మన్ చెల్మారెడ్డి మృతి



చెల్మారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జేఏసీ మాజీ చైర్మన్ వెదిరె చెల్మారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తదితరులు ఆయన మృత దేహానికి నివాళి అర్పించారు.

ఏబీవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా రవీందర్



నియామకపత్రం అందజేస్తున్న జగదీశ్వర్

మొయినాబాద్: అఖిల భారత యాదవ మహాసభ(ఏబీవైఎం) జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన రాయనోళ్ల రవీందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ యాదవ్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు రమేష్‌యాదవ్ నియామ కపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యత, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో యాదవ మహాసభ విస్తరణకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమసర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు సుధాకర్‌యాదవ్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు చెన్నయ్యయాదవ్ ఉన్నారు.

ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం

- 700 మంది రైతులకు లీగల్ నోటీసులు
- రూ.13 కోట్ల బకాయి
- రుణమాఫీ ఆశతో వాయిదాలు చెల్లించని రైతులు

యాచారం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) లో దీర్ఘకాలిక రుణాలు పొంది వాయిదాలు చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తుల జప్తునకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. యాచారం పీఏసీఎస్‌లో 2017 నుంచి 1,302 మంది రైతులు పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు, మేకలు, గొర్రెల పెంపకం కింద రూ.50కోట్లకు పైగా దీర్ఘకాలిక రుణాలు పొందారు. ఐదేళ్ల కాల వ్యవధిలో తీసుకున్న అప్పుతో పాటు వడ్డీ చెల్లించేలా రైతులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రతీ ఏటా మార్చి 30లోపు అప్పుతో పాటు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. రుణాలు పొందిన రైతులు మాత్రం వాయిదాలు చెల్లించడమే మానేశారు. కోవిడ్ పరిస్థితులు, ఇతర వ్యక్తిగత కారణాలతో రైతులు మూడు, నాలుగేళ్లుగా అప్పులు చెల్లించకపోడంతో అప్పులు ప్రస్తుతం రెండింతలుగా పెరిగాయి. పలుమార్లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, హెచ్చరిక నోటీసులు ఇచ్చి, రైతుల ఇళ్ల వద్దకెళ్లి అప్పు, వాయిదాలు చెల్లించాలని అధికారులు సూచనలు చేసినా స్పందన లేదు. తీసుకున్న అప్పులు రెండింతలు అవ్వడం, ఉన్నతాధికారుల నుంచి చివాట్లతో పాటు, షోకాజ్ నోటీసులు అందుతున్న నేపథ్యంలో రైతుల ఆస్తుల జప్తు చేయడమే మేలని పీఏసీఎస్ అధికారులు భావిస్తున్నారు.



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

ఈ ఏడాది రూ.13 కోట్ల బకాయి

యాచారం పీఏసీఎస్‌లో 700 మంది రైతులు రూ.13 కోట్ల బకాయి పడ్డారు. 2022–23 గాను మొత్తం1,302 మంది రైతుల నుంచి రూ.29కోట్లు అప్పు, వాయిదాలు వసూలు చేయాల్సి ఉండగా, 2023 మార్చి 30 వరకు కేవలం రూ.16కోట్లు మాత్రమే వసూలయ్యాయి. తమ్మలోనిగూడ, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, నక్కర్తమేడిపల్లి, యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, కుర్మిద్ద, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో వందలాది మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు పొంది పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు పెట్టుకున్నారు. అప్పులు పొందిన మొదటి ఏడాది సకాలంలోనే వాయిదాలు చెల్లించినా ఆ తర్వాత మొండికేశారు. ప్రస్తుతం రైతుల అప్పులు రెండింతలుగా పెరగడంతో వసూళ్లు చేయడం అధికారులకు తలకుమించిన భారంగా మారింది. మార్చిలో అప్పు వాయిదాలు చెల్లించని రైతుల ఇళ్ల వద్ద ఉన్న బైక్‌లు, కార్లు, తలుపు దర్వాజాలు లాక్కెళ్లారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో అధికారులు వెనుకంజ వేశారు.



దీర్ఘకాలిక రుణంతో ఏర్పాటు చేసుకున్న ఓ పౌల్ట్రీ ఫాం

పెరుగుతున్న అప్పులు

యాచారం పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలతో పాటు పంటల సాగుకు రైతులు స్వల్పకాలిక రుణాలు పొందారు. 2014 నుంచి వివిధ గ్రామాలకు చెందిన 1,100 మంది రైతులు రూ.13కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. రూ.50వేల లోపు రుణాలు తీసుకున్న రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాది క్రితం రుణమాఫీ చేసింది. కానీ ఆ రైతుల వడ్డీ ప్రస్తుతం రెండింతలుగా మారింది. యాచారం పీఏసీఎస్‌లో రూ.లక్షకు పైగా వ్యవసాయ పంట రుణాలు పొందారు. అలాంటి రైతుల అప్పులు నేడు రూ.2లక్షల లోపు పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రుణమాఫీ ప్రకటన వస్తే మేలు జరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ ఆశతో ఉన్న రైతులు స్వల్పకాలిక రుణాలను చెల్లించకపోగా ఆ అప్పులు కుప్పలుగా పెరుగుతున్నాయి.

30వేలు అదనంగా చెల్లించా



యాచారం పీఏసీఎస్‌లో పట్టాదారు పాసుపుస్తకాలను తాకట్టు పెట్టి రూ.8లక్షల అప్పు తీసుకున్నా. ఐదేళ్ల గడువు పరిమితిలో అప్పు మొత్తం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నా. పౌల్ట్రీ ఫాం పెట్టాను. కోవిడ్ సమయంలో రెండేళ్ల అప్పు చెల్లించడం భారంగా మారింది. ఆలస్యంగా చెల్లించడంతో రూ.30వేల అదనపు వడ్డీ చెల్లించాల్సి వచ్చింది.

– లిక్కి సుధాకర్‌రెడ్డి, రైతు, చింతపట్ల

రెండితలయ్యాయి



బీఆర్ఎస్ ప్రభుత్వం పంట రుణాలు పొందిన రైతులకు రుణమాఫీ అమలు చేయాలి. ఎన్నికల హామీని నెరవేర్చకపోవడం సరి కాదు. రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీసుకున్న అప్పులు, వడ్డీతో కలిపి బ్యాంకుల్లో రెండింతలు అయ్యాయి. మాల్ యూనియన్ బ్యాంకుల్లో 10 ఎకరాల మీద రూ.2లక్షల రుణం తీసుకోగా సగానికి పైగా వడ్డీనే కట్టా.

– దెండి రాంరెడ్డి, రైతు, తమ్మలోనిగూడ

అధికారులకు వివరాలిచ్చాం



పీఏసీఎస్‌కు బకాయి పడిన 700 మంది రైతులకు ఆస్తి జప్తునకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. రూ.29కోట్ల టార్గెట్ ఉండగా రూ.16కోట్లు మాత్రమే వసూలు చేశాం. రుణమాఫీ ఆశతో రైతులు స్వల్పకాలిక రుణాలు చెల్లించడం లేదు. రికవరీలో 52శాతమే టార్గెట్ పూర్తి చేశాం. ఉన్నతాధికారులు వసూలుకు ఒత్తిడి చేస్తున్నారు.

– నాగరాజు, సీఈఓ, పీఏసీఎస్, యాచారం

బస్సు, బైక్ ఢీ..

ద్విచక్రవాహనదారుడికి గాయాలు

కేశంపేట: ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెబ్బె నర్సింహ తన కుమారుడు తరుణ్‌తో కలిసి పని నిమిత్తం కేశంపేటకు వచ్చారు. గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో ఇంధనం పోయించుకుని వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నర్సింహకు గాయలవ్వగా తరుణ్ బైక్‌పై నుంచి దూరంగా పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల హామీలు నెరవేర్చాలి

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయన శుక్రవారం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా స్టాఫ్ రిపోర్టర్లతో కలసి సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన భూమిక అత్యంత కీలకమైనదన్నారు. ఉద్యమ నేతగా జర్నలిస్టులను ఎన్నో సార్లు ప్రశంసించిన ఆయన సీఎంగా ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల చిరకాల స్వప్నం అయినా ఇళ్ల స్థలాలు అర్హులైన జర్నలిస్టులకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక అర్ధాంతరంగా మృత్యువాత పడుతున్నారని.. మరికొందరు వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టు ఆరోగ్య పథకం కింద అందించిన హెల్త్ కార్డులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న జర్నలిస్టులను గుర్తించి జర్నలిస్టు బంధు పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తమ సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలో భాగంగా వారం రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ కు పదివేల పోస్టు కార్డులు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సామ జైపాల్‌రెడ్డి, ఎస్.శ్రీశైలం, గణేశ్, జంగయ్య, సురేశ్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

- చింతుల్లలో రూ.1.70లక్షల నగదు, రూ.5లక్షల విలువైన ఆభరణాలు అపహరణ
- ఇందిరానగర్‌లో 7 తులాల బంగారు ఆభరణాలు, నగదు మాయం
- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

యాచారం: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని చింతుల్లలో చోటు చేసుకుంది. బాధితులు, సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అండేకార్ వీరోజీ రెండు రోజుల క్రితం నగరంలోని తమ సమీప బంధువుల శుభకార్యానికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం వారు ఇంటికి వచ్చేవరకు తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందనే అనుమానంతో ఆయన వెంటనే 100కు సమాచారం ఇచ్చా రు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రూ.1.70 లక్షల నగదు, రూ.5లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, 18 పట్టు చీరలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఫిర్యాదు అందుకున్న సీఐ సైదయ్య గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కర్మకాండలకు వెళ్లి వచ్చేసరికి..

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన కూతురు కర్మకాండలు పూర్తి చేసుకుని వచ్చేవరకు గుర్తు తెలియని వ్యక్తులు అద్దె ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. ఆదిబట్ల సీఐ రవికుమార్, ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. నగరంలోని పురానాపూల్‌కు చెందిన బోహిని యాదయ్య కుర్మల్‌గూడ సమీపంలోని ఇందిరానగర్ కాలనీలో మే 1న అద్దె ఇంటికి వచ్చారు. పక్కనే కొనుగోలు చేసిన ప్లాట్‌లో ఇంటిని నిర్మించుకుందామనుకున్నారు. మరుసటి రోజే కూతురుకు అనారోగ్యంగా ఉందని తెలియడంతో పురానాపూల్‌కు వెళ్లారు. ఆమె మే 14న మృతి చెందింది. కర్మకాండలు పూర్తి చేసుకుని గురువారం కుర్మల్‌గూడ వచ్చారు. ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో కుమారుడికి ఫోన్ చేయగా రేపువెళ్దామన్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారా తాళం తెరుచుకోలేదు. పగలగొట్టి చూడగా లోపల లాకర్ విరిగిపోయి ఉంది. అందులోని సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.70వేల నగదు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు సేకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాన్పుల సంఖ్య పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి
- ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, డీఈఓ, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు గర్భిణులకు గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. క్రమం తప్పకుండా టీటీ వ్యాక్సినేషన్, ఐరన్, ఫోలిక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. గర్భిణులకు ఎనిమియా వ్యాధి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలదే అన్నారు. ప్రతీ బుధ, శనివారం వ్యాక్రినేషన్ ప్రక్రియంలో భాగంగా ఏడాది వయస్సులోపు ఉన్న చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేయాలని చెప్పారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విధి నిర్వాహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డివిజన్ వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

హుడాకాంప్లెక్స్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2కు చెందిన మహ్మద్ పాషా సోఫా రిపేర్‌లు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి పై నూనతంగా మరో అంతస్తును నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఇంట్లో వస్తువులన్నీ ఒక గదిలో ఉంచి మరో ఇంట్లో నిద్రిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ రావడంతో ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ఇంటిని సందర్శించి పాషాను పరామర్శించి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రి సబితా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.



కాలిపోయిన వస్తువులు చూపుతున్న బాధితుడు

వారెవ్వా.. 'సామాజిక' బాధ్యత

- ఇంటినుంచి వెళ్లిన బాలురను పట్టించిన సోషల్ మీడియా
- వాట్సాప్‌లో చూసి చిన్నారులను గుర్తించిన మెదక్ పోలీసులు
- సంరక్షణలోకి తీసుకుని.. తల్లిదండ్రులకు సమాచారం

యాచారం: ఇంటి నుంచి వెళ్లిపోయిన అన్నదమ్ములు సోషల్ మీడియా చొరవతో తల్లిదండ్రుల వద్దకు చేరారు. సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండల ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన శ్రీను, రేణుక దంపతులకు ఇద్దరు కొడుకులు సంతానం(మైనర్లు). తల్లిదండ్రులు మాల్ మార్కెట్‌లో నివా సం ఉంటూ పదేళ్లుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం 3.30 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ నిద్రలేచి ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఉదయం 5గంటలకు తండ్రి లేచిచూడగా కుమారులు కనిపించలేదు. కాసేపు చుట్టుపక్కల వెతికినా జాడ కనిపించకపోవడంతో యాచారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాల్ మార్కెట్లోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ విషయం రోజంతా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో మెదక్ బస్టాండ్‌లో వీరిని గుర్తించిన స్థానిక పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మెదక్ పోలీసుల సంరక్షణలో ఉన్న తమ కుమారులను తెచ్చుకునేందుకు తల్లిదండ్రులు